# ప్రెస్ బిల్ వస్తోంది




**కా**లనీ వాళ్ళందరం తెల్లారుజామున అయిదుగంటలకే లేచి రడీ అయిపోయి ఆరుగంటల కల్లా వేదిక దగ్గరకు చేరుకున్నాం.

ప్రెస్‌బిల్‌ని ప్రభుత్వం బలవంతంగా అమలు జరపటం ప్రారంభిస్తోందని తెలిసి మా కాలనీలో అందరం పేపర్ కొనడం మానివేశాం. ఎందుకంటే ఏ పేపర్ లోనయినా ఒకటే న్యూస్ ఉంటుందనీ, అంచేత అందరూ కలిసి ఒకటే కొని అయిదు నిముషాలు అందులో న్యూస్ చదివితే సరిపోతుందనీ గోపాల్రావ్ మాకు సలహా ఇచ్చాడు. గోపాల్రావ్ జర్నలిస్ట్ కనుకా, ప్రెస్ బిల్ గురించీ వార్తాపత్రికల గురించీ, అతనకి తెలిసినంతగా మాకు తెలీదు గనుక– మేము ఆ సలహాను ఫాలో అయిపోయాము.

మరికాసేపట్లో గోపాల్రావ్ వాళ్ళ పత్రికాఫీస్ నుంచి "ఈక్షణం" దినపత్రిక కాపీ ఒకటి తీసుకొచ్చాడు.

వేదిక మీద నిలబడి పత్రిక చదవడం ప్రారంభించాడు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థాపించిన రికార్డ్. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలన్నీటినీ పరిష్కరించడం జరిగింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించినంత వరకూ ఎలాంటి సమస్యలూ

లేవు. ఇది ప్రపంచ చరిత్రలోనే అపూర్వం! ఈ సందర్భంగా మన ముఖ్యమంత్రి ప్రభుత్వాధికారులకూ ప్రజలకూ తమ అభినందనలు తెలియజేశారు. అంతే కాదు. 164వ సారిగా తను మళ్ళీ ప్రజలసేవకు అంకితమవుతున్నానని తెలియజేశారు–"

అందరూ తప్పట్లుకొట్టారు.

మా ముందు కూర్చున్న ఆడవాళ్ళంతా సంబరపడిపోయారు.

"నేన్చెప్పలేదూ? అన్నగారికి దైవాంశ ఉందనీ! అందుకే పదవిలో కొచ్చిన సంవత్సరంలోనే ప్రజల సమస్యలన్నీ తీర్చేశారు–" అంది సావిత్రమ్మ.

"అవును మరి! అన్నగారు ఎంత గొప్పవారు కాపోతే అలా అన్ని వందలసార్లు మన సేవకి అంకితమయిపోతున్నారు? ఇంతుకు బోలెడు మంది ముఖ్యమంత్రుల్ని చూశాం– సంవత్సరాల తరబడి ముఖ్యమంత్రిగా ఉన్నాళ్ళు, నెలకోసారి మారిపోయేవాళ్ళూ, వారానికోసారి మారిపోయేశాళ్ళూ – మరెందరో ఏ ఒక్కరయినా ఇలా ఇన్నిసార్లు ప్రజాసేవకి అంకితమయ్యారా?" అంది మా కల్చరల్ సెక్రటరీ పార్వతీదేవి.

వాళ్ళ మధ్యలో కూర్చుని వాళ్ళ మాటలు వింటూన్న ఓ పాప ఛటుక్కున వాళ్ళమాటలకు అడ్డుపడింది.

"మమ్మీ, మమ్మీ! అంకితమవటం అంటే ఏమిటి?"

వాళ్ళిద్దరికీ ఏం చెప్పాలో తెలీక మొఖాలు చూసుకున్నారు.

"అంకితమవటం అంటే అంటే అదే జీవితం ధారపోయటం అన్నమాట!"

"ధారపోయటం అంటే ఏమిటీ?"

"నోర్మూసుకో కాసేపు"

"అసలు ఎందుకే అలా ధారపోయటం?" మళ్ళీ అడిగిందాపిల్ల.

"ఎందుకేమిటి! మంచివాళ్ళూ, గొప్పవాళ్ళూ అలా ధారపోస్తారన్న మాట!"

"మరి పున:రంకితం అంటే ఏమిటే?"

"అంటే మళ్ళీ ధారపోయటం అన్నమాట.

"ఎందుకే అన్నిసార్లు ధారపోయటం?"

"నోర్మూసుకో కాసేపు" ఆ పిల్ల కాసేపు నోరు మూసుకుంది.

"ధారపోయటం అంటే ఏమిటి?" మళ్ళీ అడిగింది.

"అంటే మనకి సహాయం చేయడానికే బ్రతకటం. అలా చేస్తే చాలా గొప్పవాళ్ళన్న మాట!"

"మరి డాడీ కూడా ఎందుకు అంకితమవ్వరు?"

"ఛస్! అది ఎన్టీఆర్ లాంటి గొప్పవాళ్ళే చేయగలరు! మీ డాడీ లాంటి వాళ్ళు

చేయలేరు–"

"ఎన్టీఆర్ మనకి ఏం సహాయాలు చేశాడు మమ్మీ?"

"పిచ్చివాగుడు వాగకు! బోలెడు చేశారని పేపర్లో రాయలేదూ?"

"మరి మనం మా స్కూల్లో డోనేషన్ కట్టనవసరం లేకుండా సహాయం చేయరెందుకని?"

"నోర్మూసుకుంటావా లేదా?" కసురుకుంది సావిత్రమ్మ. ఆ పిల్ల నోర్మూసుకుంది.

రెండోవార్త చదవసాగాడు గోపాల్రావ్.

"రాష్ట్రంలో నిత్యావసర వస్తువల ధరలన్నీ తగ్గిపోయినందుకు ఆంధ్రప్రదేశ్ పౌరుల హర్షం!" హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో ఒక సింగిల్ రూమ్ క్వార్టర్స్‌లో జరిగిన బ్రహ్మాండమయిన బహిరంగ సభలో లక్షలాది ప్రజల ప్రసంగం! ప్రెస్‌బిల్ వచ్చిన ఒక్క రోజులో అన్ని వస్తువుల ధరలూ సగానికి పైగా తగ్గించి వేయగలిగిన ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రికీ ప్రజలు తమ కృతజ్ఞతలు తెలియజేశారు–"

ఆ వార్తకు ఏంచేతో ఎవరూ చప్పట్లు కొట్టలేదు.

"ఒకవేళ ఆ మీటింగ్ జరిగినచోట ధరలు తగ్గాయేమో" అంది భారతీదేవి సావిత్రమ్మతో.

"అవును అక్కడ తగ్గే ఉంటాయ్– కాపోతే అన్ని లక్షల మంది ఎందుకు అబద్ధాలు చెప్తారు?"

గోపాల్రావ్ మళ్ళీ చదివాడు.

"నగరంలోని నిర్భయ్‌నగర్ కాలనీలో జరిగిన మరో చరిత్రాత్మక మయిన సభలో కాలనీకి చెందిన అనేకమంది గృహిణులు ఆడపడుచులు కూడా అకస్మాత్తుగా ధరలు తగ్గిపోయినందుకు ప్రభుత్వాన్ని మెచ్చుకుంటూ ప్రసంగాలు చేశారు. సభ ఆఖర్లో ఆ సభకు అధ్యక్షత వహించిన శ్యామల్రావ్‌గారు మన ముఖ్యమంత్రి అవతార పురుషులనీ అందుకే అలా ధరలు తగ్గించగిలిగాలరనీ అన్నారు–"

ఆ వార్తతో పెద్ద ఎత్తున కలకలం బయల్దేరింది అందరిలోనూ.

"మన కాలనీలో సభ ఎప్పుడు జరిగింది?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి శాయీరామ్ వంక అనుమానంగా చూస్తూ.

"అబ్బే– నాకేం తెలీదు! నేనేం మీటింగ్ పెట్టలేదు నిన్న–" అన్నాడు శాయిరామ్ కంగారుగా.

"అయ్యో! మనం ఎప్పుడన్నామలా? అసలు ధరలు తగ్గిందెక్కడ? పైగా పాలధర ఇవాళ నుంచే మళ్ళీ పెరిగిందని మిల్క్ బూత్‌వాడు ఇరవై పసలు ఎక్స్ట్రా వసూలు చేశాడు

కదా!" అంది పార్వతీదేవి.

"డియర్ ఫ్రెండ్స్!" అన్నాడు గోపాల్రావ్ "మన కాలనీలో ఈ సభ జరగలేదని మనందరికీ తెలుసు! అయినా ఈ న్యూస్ ఇలా రాశారంటే కేవలం ఆ శ్యామ్రావ్‌గాడి పనేనని నాకు అనుమానంగా ఉంది–"

"అనుమానంగా ఉంటే ఇంకా ఆలస్యం ఎందుకు? వాడింటికెళ్ళి– బయటకు పిలిచి గిటార్ వాయిస్తే సరిపోతుంది కదా–" అన్నాడు మా కాలనీలో వెయిట్ లిఫ్టర్ వివిన్‌పాల్!

అప్పటికప్పుడే అందరం కలిసి ఊరేగింపులాగా శ్యామ్రావ్ ఇంటి దగ్గరకు నడిచాము. శ్యామ్రావ్ ఇంటి బయట ఇద్దరు పోలీసులు తుపాకులు పట్టుక్కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. మమ్మల్ని చూడగానే తుపాకులు చేతిలోకి తీసుకుని పొజిషన్‌లో నిలబడ్డారు.

మాకు పరిస్థితి అర్థమయిపోయింది.

"శ్యామ్రావ్‌గారూ–" పిలిచాడు శాయిరామ్.

శ్యామ్రావ్ హడివుడిగా చొక్కా వేసుకుంటూ బయటికొచ్చాడు.

"ఏమిటీ– ఇంతమంది వచ్చారు?" అనడిగాడు ఏమీ తెలియనట్లు.

''మీరు నిన్న మన కాలనీలో ఏదో సభ జరిపారట– దాన్ని గురించి తెలుసుకుందామనీ!" అన్నాడు రంగారెడ్డి వెటకారంగా.

"అదా– అదీ జరిగింది మా ఇంట్లోనే–" అన్నాడతను.

"అలాగా – సభకు వచ్చిన జనం మీ ఆవిడా, మీ అబ్బాయ్, మీ కోడలూ అయుంటారు! అవునా?"

"లేదు ఆ చివరింటి ముసలమ్మకూడా వచ్చింది–"

మా కాలనీ బాడీబిల్డర్, వెయిట్ లిఫ్టర్ ఛటుక్కున శ్యామ్రావ్ చొక్కా పట్టుకున్నాడు.

"అలాంటప్పుడు అది కుటుంబ సభ అని రాసుకోక కాలనీ సభ అని ఎందుకు రాయించావ్ బే?"

పోలీసులు ఛటుక్కున రైఫిల్ పైకెత్తి గాలిలోకి రెండు రౌండ్లు కాల్చారు. దాంతో మేము పాల్‌ని వెనక్కు లాగేయక తప్పలేదు.

"కాలనీ సభ్యులారా! ఇదంతా ప్రభుత్వం పన్నిన కుట్ర! మన శ్యామ్రావ్ వాళ్ళ దగ్గర ఏ పాతికో పరకో లంచం తిని ఇచ్చిన స్టేట్‌మెంట్ అది! అంచేత మనం ఇవాళే మరో స్టేట్‌మెంట్ తయారు చేసి ధరల గురించిన నిజానిజాలు అన్ని పత్రికల్లోనూ ప్రచురింపజేద్దాం!" అన్నాడు శాయిరామ్.

అందరం మళ్ళీ వేదిక దగ్గరకెళ్ళి ఓ తీర్మానం తయారుచేసి దానిని పత్రికాఫీసుకి

పంపిచే బాధ్యత రంగారెడ్డి, గోపాలరావ్‌ల మీద పెట్టాం!

ఆ తరువాత పేపర్లో వార్తలన్నీ మిగతా రాష్ట్రాల్లో ప్రజలు ఎన్ని కష్టాలు పడుతోందీ, అక్కడ ప్రభుత్వాలు ఎంత నికృష్టంగా పరిపాలిస్తోందీ– వీటి గురించినవే!

సరిగ్గా అప్పుడే మా కాలనీ తాలూకు కుర్రాడొకడు పరుగుతో మా దగ్గరకొచ్చాడు.

"అంకుల్– మా మమ్మీ మిమ్మల్ని అర్జంటుగా పిలచుకు రమ్మంటోంది–" అన్నాడు శాయిరామ్‌తో.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"మా పక్కింట్‌లో తాతగారు ఉరివేసుకుని చచ్చిపోయారట–"

అందరం ఆదరాబాదరా పరిగెత్తాం. ఆ కుర్రాడితల్లి భయంగా ఇంట్లో నుంచి బయటకొచ్చింది. ఆమె వెనుకే ఏడుస్తూ ఓ ముసలమ్మ బయటికొచ్చింది..

"ఆ ఇల్లేనండీ! పొద్దున్నుంచీ చడీచప్పుడూ లేకపోతేనూ తలుపు తోసి చూశాను. లోపల ఉరేసుకుని వేలాడుతూ కనిపించారు. పాపం ఈ మామ్మగారు పస్తులుండలేక వాళ్ళమ్మాయి ఇంటికెళ్ళి ఇప్పుడే బియ్యం అప్పుగా తెచ్చుకున్నారు. వచ్చేసరికి ఆయన ఉరి సీన్."

నేనూ, శాయిరామ్ రంగారెడ్డి చప్పున ఆ ఇంట్లోకి నడిచాము. ముసలాయన శరీరం తాడుకి వేలాడుతూనే ఉంది.

టేబుల్ మీద ఓ కాగితం పేపర్ వెయిట్ కింద కనబుతోంది.

నేను త్వరగా ఆ పేపర్ తీసుకుని చూస్తాను.

"రిటైర్ అయి సంవత్సరం దాటినా ఇంకా నాకు పెన్షన్ రాలేదు. ప్రభుత్వానికి ఎన్నో ఆర్జీలు పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. తినడానికి తిండికూడా లేని పరిస్థితుల్లో– నా జీవితాన్ని అంతం చేసుకోవాల్సి వస్తోంది, నా చావుకి ముమ్మార్లూ ప్రభుత్వానిదే బాధ్యత–"

ఆ పేపర్ తీసుకెళ్ళి బయట అందరికీ గట్టిగా చదివి వినిపించాను.

"మరి పేపర్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఆర్జీగాని, ఫైల్‌గానీ, కేస్‌గానీ పెండింగ్‌లో లేదని రాశారేంటి?" అడిగింది రాజేశ్వరి కోపంగా.

మేం ఆ తర్వాత కార్యక్రమం నిర్వహించడానికి బయల్దేరాం.

మర్నాడు పేపర్లో వచ్చిన వార్తలు చూసేసరికి మాకు మతిపోయినట్లయింది.

"నిర్భయ్‌నగర్ కాలనీలో– ఓ వృద్ధుడు కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. అయితే అతని మానసిక పరిస్థితి సరిగ్గాలేదని కూడా తెలుస్తోంది. అతను మాజీ ప్రభుత్వోద్యోగి. పోలీసులు శవాన్ని మార్చురీకి పంపించారు"

దానికిందే మరోవార్త!.

"ధరలను ప్రభుత్వం అదుపులో పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్భయ్‌నగర్ కాలనీలోనే జరిగిన మరో ఊరేగింపు శ్యామ్రావ్ ఇంటికి వెళ్ళినప్పుడు ఆనందోత్సాహాలు పట్టలేక ఇరువురు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. అందరూ మూకుమ్మడి నృత్యాలు జరిపాక ఆ ఊరేగింపు ప్రశాంతంగా ముగిసింది!"

"ఇది టూమచ్ అన్యాయం ఉన్నాయి–" అన్నాడు నిసార్.

"మనం ధరలు తగ్గినందుకు నృత్యాలు చేశామా? ఏడుపొచ్చినా సంతోషం వచ్చినా పాటలు పాడుతూ డాన్స్‌లు చేయడానికి ఇదేం సినిమానా?" అంది పార్వతీదేవి ఉక్రోషంగా.

"మనం వూరుకుంటే లాభంలేదు. ఈ వార్త అబద్ధమని మరో పేపర్ స్టేట్‌మెంటివ్వాలి!" అంది రాజేశ్వరి.

"దానిని మాత్రం ఎవరు పబ్లిష్ చేస్తారు?"

"ఎవరికీ ఏం చేయడానికి తోచలేదు. మేము మాట్లాడుతూండగానే పోలీస్‌వాన్ ఒకటి వేగంగా వచ్చి మాకు సమీపంగా ఆగింది. అందులో నుంచి ఇన్‌స్పెక్టర్ ఇద్దరు కానిస్టేబుల్స్ దిగారు.

"ఇక్కడ 'ఈక్షణం దినపత్రిక ఛీప్ రిపోర్టర్ గోపాల్రావ్ ఎవరు?"

"నేనే" అన్నాడు గోపాల్రావ్.

"నిన్ను అరెస్ట్ చేస్తున్నాం–"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

"కొన్ని వార్తలు సెన్సార్ ఆఫీస్ అనుమతి లేకుండా పబ్లిష్ చేసినందుకు"

"ఏమిటా వార్తలు?"

ఇన్‌స్పెక్టర్ పేపర్ తీసుకుని గట్టిగా చదివాడు.

"నిర్భయ్‌నగర్ కాలనీలో మెదడువాపు వ్యాధి! ఆరుగురు పిల్లలు మృత్యువుతోపోరాటం జరుపుతున్నారు. కాలనీలో యధేచ్ఛగా తిరుగుతూన్న పందులవల్ల ఈ వ్యాధి మరికొంతమందికి సోకే అవకాశం ఉంది" ఇది ఇది ఎవర్నడిగి రాశారు?"

"ఇందులో అడగాల్సిందేముందీ– మా కాలనీకొచ్చి ట్రీట్ చేసిన డాక్టర్లు చెప్పిందే రాశాను–"

"డాక్టర్లెవరయ్యా చెప్పటానికి! గవర్నమెంట్ చెప్పాలి– వాళ్ళకేం జబ్బో! ప్రెస్‌బిల్ అమల్లో ఉన్నప్పుడు అన్ని విషయాలూ గవర్నమెంటే చెప్తుంది! తెల్సిందా?"

"తెల్సిందండీ"

"అసలు ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి అంటువ్యాధులూ లేవనీ, ప్రభుత్వం అన్ని జబ్బులనూ

పూర్తిగా నిర్మూలించేసిందనీ ప్రభుత్వం నిన్నే స్టేట్ మెంటిచ్చింది! నువ్వేమో ఇవాళ మెదడు వాపు వ్యాధి ఉందని రాస్తావా?"

"నిజంగానే ఉందికదాని–"

"పిచ్చివాగుడు వాగకు– ఉన్నవన్నీ రాసేస్తే ఇంక ప్రెస్‌బిల్ ఎందుకు, మేమెందుకు? ఏమేం నిజాలకు– ఏమేం అబద్ధాలు రాయాలో గవర్నమెంట్ ఒక పట్టిక జారీచేసింది– మీ పత్రికకు చేరలేదా అది?"

"లేద్సార్–"

ఇన్‌స్పెక్టర్ జేబులోనుంచి ఓ పట్టిక తీసి గోపాల్రావ్ కిచ్చాడు. మేమంతా గోపాల్రావ్ చుట్టూ మూగిచదివాం.

1) రాష్ట్రంలో ఎక్కడయినా ఎలాంటి వ్యాధులయినా వ్యాపించినప్పుడు ఆ విషయం దాచి– ఆ బాధితులందరూ పెళ్ళిలో విషపూరితమయిన విందు భోజనం చేసినందున అస్వస్థులయారని రాయవలెను.

2) ఎవరు సమ్మెలు చేసిననూ ఆ విషయం దాచి– ఆయా ఉద్యోగులు లేక కార్మికులు సాంస్కృతిక వారోత్సవాల్లో పాల్గొనుచున్నారని వ్రాయవలెను.

3) పోలీసు కాల్పులను, లాటీ చార్జీలనూ, భాష్పవాయు ప్రయోగాలనూ– ఏ పరిస్థితిలోనూ రాయకూడదు.

4) ఆకలి చావులకు స్వల్పమార్పులుచేసి అజీర్ణవ్యాధితో మరణించి నట్టు వ్రాయవలెను.

ఇలా చాలా పెద్ద లిస్ట్ కనిపించింది.

"ఇది టూమచ్ అన్యాయం ఉన్నయ్" అన్నాడు నిసార్ మళ్ళీ.

"పిచ్చిమాటలు మాట్లాడితే నిన్ను కూడా అరెస్ట్ చేస్తాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నిసార్‌ని కోపంగా చూస్తూ.

"అచ్చా! నేను నమాజ్‌కు పోతున్నయ్–" అనేసి అర్జంటుగా నమాజ్ కెళ్ళిపోయాడు నిసార్. పోలీసులతో వాదిస్తే ఏం జరుగుతుందో వాడికి అనుభవపూర్వకంగా తెలుసు.

ఇన్‌స్పెక్టర్ పేపర్లో మరోవార్త చదివాడు బిగ్గరగా.

"అసెంబ్లీ దగ్గర జర్నలిస్టులపై పోలీస్ లాఠీచార్జి– ఇదెవర్నడిగి రాశావ్"

"చూసి రాశానండీ!"

"చూసి రాయమని ఎవరు పర్మిషనిచ్చారు నీకు?"

"ఎవరూ ఇవ్వలేదు–"

"సరే– పద ముందు స్టేషన్‌కి–"

"ఓసారి మా పత్రికాఫీస్‌కి ఫోన్‌చేసి మా ఎడిటర్ గారితో మాట్లాడి వస్తాను–"

"ఎందుకు?"

"నన్ను జామీను మీద విడిపించడానికి!"

"మీ ఎడిటర్నే లాకప్‌లో పడేశాం. ఇంక నీకు జామీనేమిటి– పద–"

"అదేమిటి మా ఎడిటర్ని ఎందుకు అరెస్ట్ చేశారు?"

"ఇవాళ్టి పేపరులో మా ఆదేశాల ప్రకారం ముఖ్యమంత్రి ఫోటో వేసి పొగడ్తల దండకం రోజుకొక కవిత రాయించాలి. ప్రభుత్వం వల్ల సహాయాలు పొంది లక్షాధికారులయిన కోట్లమంది బీద ప్రజల ఇంటర్వ్యూలు వేయాలి. ఇవేమీ చేయలేదు మీ పేపర్–"

గోపాల్రావ్ ఏమీ మాట్లాడలేదు.

"పద– వాన్ ఎక్కు–" అన్నాడు ఇన్‌స్పెక్టర్. గోపాల్రావ్ వాన్ ఎక్కక తప్పలేదు. అతని భార్య పిల్లలూ ఏడుస్తూ వాన్ దగ్గర నిలబడ్డారు. వాన్ వెళ్ళిపోయింది.

రెండ్రోజుల తర్వాత మేమంతావెళ్ళి గోపాల్రావ్‌ని జామీను మీద విడిపించాం. తీరా గోపాల్రావ్ బయటకొచ్చేసరికి అతని వళ్ళంతా బాండేజీలు కనిపించినయ్.

"ఏమిటిది? ఏం జరిగింది?"

అడిగాడు శాయిరామ్ ఆశ్చర్యంగా.

"జర్నలిస్టుల మీద లాఠీచార్జీ చేసినట్లు రాశానని నన్నూ, మా ఎడిటర్నీ చావగొట్టారు!"

"దిసీజ్ టూ మచ్– వెంటనే ప్రధానమంత్రికి టెలిగ్రాం ఇద్దాం–" అన్నాడు రంగారెడ్డి.

"అలాక్కాదు– గోపాల్రావ్‌ని బాండేజీలతో ఫోటోలు తీసి రాజీవ్‌గాంధీకి పంపితే ఋజువులతో పంపినట్లుంటుంది" అన్నాడు చంద్రకాంత్.

అప్పటికప్పుడు ఫోటోలు తీసి రాజీవ్‌గాంధీకి పంపించాం. కానీ మర్నాడు పేపర్ చూస్తూనే మా మొఖాలు వాడిపోయాయి.

"ఒక న్యూస్‌పేపర్‌కి చెంది ఎడిటరూ, ఛీఫ్ రిపోర్టరూ నిన్న పోలీస్ స్టేషన్ దగ్గర జరిగిన స్కూటర్ ప్రమాదంలో గాయపడినట్లు పోలీసులు తెలియజేస్తున్నారు–"

మరో రెండు రోజుల గడిచాయి.

మేమందరం కాలనీ మధ్యలో కూర్చుని కొన్ని గాలివార్తలు గురించి చర్చించుకొంటుండగా గోపాల్రావ్ వారపత్రిక తాలూకూ వాన్‌లో హడావుడిగా వచ్చాడక్కడికి "పదండి– త్వరగా! ఇక్కడికి దగ్గర్లోనే హరిజన గూడెం మీద పక్క ఊరివాళ్ళు దొమ్మీ జరిపి చాలా దారుణాలు చేశారంట! న్యూస్ తీసుకొద్దాం!" అందరం వాన్ ఎక్కాం, గంటసేపట్లో ఆ ఊరు చేరుకుంది మా వాన్. పోలీసులు ఊరిబయటే వాన్ ఆపేసారు.

"న్యూస్ పేపర్ నుంచి" అని చెప్పాక లోపలకు వెళ్ళివచ్చారు. హరిజనుల ఇళ్ళు చాలా కాలిపోయినయి. చాలామంది ఆ మారణకాండకు బలి అయిన వారి చుట్టూ

కూర్చుని ఏడుస్తున్నారు. పోలీసులు, ప్రభుత్వాధికారులతో చాలా హడావుడిగా ఉందా ప్రాంతం. న్యూస్ అంతా చూచినది చూచినట్లు రాసుకుని, కొన్ని ఇంటర్వ్యూలు రికార్డ్ చేసుకున్నాక అందరం తిరిగి వచ్చాం మళ్ళీ. మర్నాడు 'ఈ క్షణం పేపర్ చూసేసరికి మాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

"నగరానికి దగ్గరగా ఉన్న హరిజన వాడలో జరిగిన ఓ అగ్ని ప్రమాదంలో అనేక ఇళ్ళు దగ్గమయాయ్. అనేక మంది హరిజనులు నిరాశ్రయులయారు. అయితే ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకుని సేవలు చేసేసింది. వారిప్పుడు ఎంతో హాయిగా ఉన్నారు–" అని ఉంది అందులో ఆ వార్త పక్కనే ఒక ఫోటో వేశారు. ఆ హరిజనవాడకు చెందిన ఓ అయిదేళ్ళ పిల్ల చిరునవ్వు నవ్వుతోంది కెమెరావేపు చూస్తూ. దాని కింద ఇలా రాసి వుంది.

"హరిజనవాడలో అందరూ ప్రభుత్వ సహాయానికి ఎంతో ఆనందంతో చిరునవ్వులు చిందిస్తోన్న దృశ్యం–"

"వరంగల్ అడవుల్లో నగ్జలైట్లు అని అనుమానింప బడుతున్న కొంతమంది నిన్న రాత్రి పొరబాటున తమని తామే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీస్ వర్గాలు తెలియజేస్తున్నారు. ఇలా ఆత్మహత్యలు చేసుకోవడం చట్టవిరుద్ధమనీ, ఆత్మహత్యలు చేసుకున్న వారివి అరెస్ట్ చేయడం జరుగుతుందనీ పోలీస్ కమిషనర్ గారు– హెచ్చరిస్తు న్నారు"

రాన్రాను మన రాష్ట్రంలో ఏం జరుగుతున్నదీ, ఎవరికీ తెలియకుండా పోయింది. ఓసారి వారం రోజులపాటు బస్సులు నడవకపోవటం చేత అందరం ఆఫీసులు మానివేయాల్సి వచ్చింది.

పేపర్లో చూస్తే అదనంగా బోలెడు బస్సులు హైద్రాబాద్‌లో నడుపుతున్నందువల్ల ప్రజలకు చాలా మేలు చేకూరినట్లు అనేమంది ప్రభుత్వాధి కారులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. వారం రోజుల నుంచి నీళ్ళ సప్లయ్ ఆగిపోయింది. ఆ విషయం ఎవరికి రిపోర్ట్ చేసినా ఉపయోగం లేకపోయింది. రెండు రోజుల పాటు సిటీలో ఎలక్ట్రిసిటీ లేకుండా పోయింది.

నగరంలో వెన్నెల ఎక్కువగా లభ్యమవుతున్న కారణంగా ప్రజలు విద్యుచ్ఛక్తి వాడకం తగ్గించాలని పేపర్లో మరో అధికారి స్టేట్‌మెంట్ కనిపించింది.

కొత్త పన్నులు విధించమని ప్రభుత్వాన్ని కోరుతూ చాలామంది ప్రజలు అనేక పట్టణాల్లో ఊరేగింపులు జరిపి వినతి పత్రాల్ని గవర్నర్‌కు అందిచారట ప్రజల కోరి మేరకు మరో రెండు రోజుల తర్వాత ప్రభుత్వం కొత్త పన్నులు విధించింది. కొత్త పన్నులు విధించినట్లు ప్రకటన వెలువడిన రోజు హైదరాబాద్‌లోని కొన్ని కోట్లమంది ప్రజలు

లారీల్లో తిరుగతూ, బాణాసంచా కాలుస్తూ ప్రభుత్వాన్ని అభినందించారట!

మరో రోజు రాష్ట్రంలోని ప్రజలంతా అన్ని ఊళ్ళల్లోనూ ప్రదర్శనలు జరిపి అసలు దేశంలో ఎలక్షన్లు అనేవి రద్దుచేయాలని ఇప్పటి ప్రభుత్వం కేంద్రానికి అనుమతి కోసం పంపించింది! రాష్ట్రానికి చెందిన దొంగలంతా తాము మారిపోయామని ప్రభుత్వానికి చెప్పి దొంగతనాలు చేయడం మానివేశారట! కనుక రాష్ట్రంలో దొంగతనాలు లేవట. ఈ గందర గోళంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతూండగా నిసారీగాడు ఓ అర్ధరాత్రి వచ్చి మా తలుపు కొట్టాడు.

"ఏమిటి?" అడిగాన్నేను రహస్యంగా.

"రాత్రి తెల్లవారుజామున నాలుగు గంటలకి బెంగుళూర్ నుంచి లారీ వస్తున్నాయ్? అందులో బెంగుళూర్ న్యూస్ పేపర్స్ వస్తయ్ ఆ పేపర్లు సెన్సారింగ్ లేని న్యూస్ ఉంటాయి–" అన్నాడువాడు.

అప్పటికప్పుడే అందరం వెళ్ళి చెక్‌పోస్ట్ దగ్గర నిలబడి బెంగుళూరు న్యూస్ పేపర్ కోసం ఎదురుచూడసాగాం. నాలుగ్గంటలకల్లా నిసార్ గాడు చెప్పినట్లు లారీవచ్చింది. అప్పటికే కొన్ని వందల మంది దాని కోసం ఎదురుచూస్తూండడం చేత అందరూ లారీని చుట్టుముట్టేశారు. డ్రైవర్ నెమ్మదిగా న్యూస్ పేపర్ల కట్టతీసి ఒక్కొక్క ప్రతి పది రూపాయలు చొప్పున బ్లాక్‌లో అమ్మటం ప్రారంభించాడు. అతి కష్టం మీద ఓ కాపీకొని కాలనీకి చేరుకొన్నాం. కాలనీ వాళ్ళందరూ పిల్లా పాపలతో సహా మా కోసం వేచి ఉన్నారు. మమ్మల్ని అంత దూరంలోతో చూడగానే "దొరికిందా" అనడిగారు ఆశగా.

దొరికిందనేసరికి వాళ్ళ ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

"సెన్సార్ అవని పేపర్ చూసి ఎంత కాలమయిపోయిందో– ఒక్క సారి చూడనీండి!" అంటూ రంగారెడ్డి వెంబడి పడ్డారు. రంగారెడ్డి అతి కష్టం మీద పేపర్ని కాపాడి వేదిక చేరుకున్నాడు.

"సోదరులారా! మీరందరూ క్రమశిక్షణతో నిశ్శబ్దంగా ఉంటే– ఈ స్మగుల్డు న్యూస్ పేపర్‌ని అందరూ చూడవచ్చు. వినవచ్చు!" అన్నాడు శాయిరామ్.

మరుక్షణంలో అందరూ నిశ్శబ్దంగా రెడ్డివైపు చూడసాగారు. రెడ్డి కర్నాటకకు చెందిన న్యూస్ పేపర్‌ని మడత విప్పి అందరూ చూసేట్టుగా పట్టుకున్నాడు. మరుక్షణంలో కరతాళధ్వనులు మిన్నుముట్టినయి. కొంత మంది ఆడాళ్ళు కన్నీళ్ళు వత్తుకున్నారు. "ఎంతకాలమయిందో నమ్మా అసలయిన న్యూస్ పేపర్‌ని చూసి" అంది సావిత్రమ్మగారు.

రంగారెడ్డి పతాక శీర్షిక బిగ్గరగా చదవసాగాడు. ఒక్కొక్క వాక్యం చదువుతున్న కొద్దీ తప్పట్లు ఈలలు మార్మోగిపోసాగాయి. ఈ హడావుడిలో పోలీసులు ఎప్పుడువచ్చి మమ్మల్ని




చుట్టూ ముట్టిందీ మాకు తెలీలేదు.

"ఎక్కడి వాళ్ళక్కడే ఉండండి! లేపోతే కాల్చిపారేస్తాం!" అన్నకేక వినిపించాకగానీ మేము స్పృహలోకి రాలేదు. చుట్టూ తుపాకులు పట్టుకుని పోలీసులు నిలబడి ఉన్నారు. పోలీస్ అధికారి ఒకరు స్టేజిమీదకొచ్చి రంగారెడ్డి చేతిలోని కర్నాటక రాష్ట్రం పేపర్ లాక్కున్నాడు.

"అభ్యంతరకరమయిన రాతలతో నిండి ఉన్న ఈ పేపర్ కొన్నిందుకూ, దీనిని చదివినందుకూ, చదువుతూండగా విన్నందుకూ మీ కాలనీలో అందరినీ అరెస్ట్ చేస్తున్నాం–" అన్నాడు గంభీరంగా. కొద్ది క్షణాలు భయంకరమయిన నిశ్శబ్దం తాండవించింది ఆ ప్రాంతమంతా!

హఠాత్తుగా పెద్దా పిల్లా – అందరూ ఒక్కసారి వేదికమీదకు ఎగబడి ఆ న్యూస్ పేపర్ని ముక్కలు ముక్కలుగా చింపి అందరూ తలో నాలుగు ముక్కలూ మింగేశారు. పోలీసులు షాకయ్యారు. న్యూస్ పేపర్ ముక్కలు మింగి బ్రేవ్‌మని తేన్చాక రంగారెడ్డి పోలీసధికారి వేపు చూశాడు.

"ఏ న్యూస్ పేపర్ గురించీ మీరు మాట్లాడుతోంది?" అడిగాడతను.

* * * * *